

సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 21 । మార్చి । 2024




అడవులపైనే మానవుని భవిత

అడవుల సంరక్షణపై అవగాహనకు ఏటా మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. **ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.** 8లో ▸



కొల్లేటికోటలో నేడు కల్యాణం

కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గా, గోకర్ణేశ్వర స్వామి కల్యాణం గురువారం రాత్రి నిర్వహించనున్నారు. 8లో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ గురువారం (సాయంత్రం)	సహరి శుక్రవారం (ఉదయం)
భీమవరం	6.21	4.48
ఏలూరు	6.24	4.44

కూటమిలో సీట్ల కుంపటి

- నరసాపురం సీటుపై రగడ
- జనసేన సీటు తనకే ఇచ్చారంటున్న నాయకర్
- పార్టీ నుంచి సమాచారం లేదంటున్న మాజీ మంత్రి కొత్తపల్లి
- ఉండిలో మాజీ ఎమ్మెల్యే శివ తిరుగుబావుటా
- టీడీపీ రెబల్‌గా బరిలో దిగేందుకు ప్రయత్నాలు
- తణుకులో మౌనం వీడని విడివాడ
- భీమవరంలో అంతుపట్టని అంజిబాబు వైఖరి



సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో అసంతృప్తి సెగలు చల్లారడం లేదు. తాంబూలాలిచ్చేశాం తన్నుకు చావండన్న ధోరణిలో సీట్ల కేటాయింపులు చేశారని కేడర్ మండిపడుతుంది. అధినాయకత్వాల తీరు పట్ల ఆగ్రహంతో రగిలిపోతున్నారు. జిల్లాలోని దాదాపు అన్ని నియోజకవర్గాల్లో విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఉండిలో రెబల్‌గా బరిలో దిగేందుకు కలవపూడి శివ సిద్ధమవుతుండగా.. భీమవరంలో జనసేన అభ్యర్థితో ఆ పార్టీ నేతలే అంటీముంటనట్లుగా ఉన్నారు. నరసాపురంలో సీటుపై రగడతో కేడర్ అయోమయంలో పడిపోయింది. తణుకులో విడివాడ వర్గం టీడీపీకి సహకరించేందుకు ఇష్టపడడం లేదు.

నాయకర్ వర్సెస్ కొత్తపల్లి

జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు పొత్తులో భాగంగా భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం నియోజకవర్గాలు జనసేన, తణుకు, ఆచంట, పాలకొల్లు, ఉండి నియోజకవర్గాల్లో టీడీపీ తమ అభ్యర్థులను బరిలో దింపింది. ఇటీవల విజయవాడలో పవన్‌కళ్యాణ్‌ను కలిసిన జనసేన నాయకుడు బొమ్మిడి నాయకర్ నరసాపురం సీటు తనకే ఇచ్చారంటూ ప్రకటించుకోవడంతో పాటు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. ప్రజాగళం సభకు సంఘీభావ ర్యాలీ సందర్భంగా నాయకర్‌కు సీటు కేటాయింపుపై తనకు సమాచారం ఏమీ లేదని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు చేసిన వ్యాఖ్యలు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల జనసేనలో చేరిన సుబ్బారాయుడు సీటు తనదేనంటూ ప్రచారం చేసుకున్నారు. అటు నాయకర్, ఇటు కొత్తపల్లి ఎవరికి వారు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది. తాజాగా సుబ్బారాయుడు వ్యాఖ్యల నేపథ్యంలో నరసాపురం సీటు పంచాయితీ కొలిక్కివచ్చినట్టు లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. మరోవైపు టీడీపీలోను వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. గత రెండు రోజులుగా మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు వర్గం, ప్రస్తుతం పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న పొత్తూరి రామరాజు వర్గం ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. రామరాజు ఇన్‌చార్జి బాధ్యతలను మరి కొద్ది రోజుల్లో పీకేస్తారంటూ బండారు వర్గం ప్రచారం చేస్తుండగా బండారుకు పార్టీలో స్థానమే ఉండదంటూ రామరాజు వర్గం చేస్తున్న వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 2019 ఎన్నికల్లో నియోజకవర్గంలో మూడో స్థానానికి పరిమితమైన టీడీపీ తాజా పరిణామాలతో మరింత దిగజారుతుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

పార్టీ కార్యక్రమాలకు దూరంగా విడివాడ వర్గం

వారాహి యాత్ర సందర్భంగా పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీతో తణుకు టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావుకు అధినేత నిర్ణయం మింగుడు పడటం లేదు. తణుకు సీటు టీడీపీకి కేటాయించడంపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న విడివాడ వర్గం అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉండిపోయింది. తాడేపల్లిగూడెం జెండా సభ ఏర్పాట్లు పర్యవేక్షించేందుకు వచ్చిన సందర్భంగా విడివాడ అనుచరుల నిరసన నేపథ్యంలో న్యాయం చేస్తామని మాటిచ్చిన నాదెండ్ల మనోహర్ తర్వాత కనీసం పలకరించింది లేదు.

అంజిబాబుపై అసంతృప్తి

భీమవరంలో గత ఐదేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటూ ఇటీవల జనసేన సీటు తెచ్చుకున్న టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కేడర్‌ను దగ్గరకు చేసుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. ఇప్పటికే జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అంజిబాబు అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తుండగా గత పది రోజులుగా జనసేనను దగ్గరకు చేసుకునే ప్రయత్నాల కంటే పాత పరిచయాలున్న టీడీపీ కేడర్ పట్ల ఎక్కువ మక్కువ చూపిస్తున్నారంటూ జనసేనలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అంజిబాబు ప్రవర్తన చూస్తుంటే టీడీపీ అభ్యర్థా, లేక జనసేన అభ్యర్థా అనే సందేహం వ్యక్తమవుతోందని జనసేన కేడర్ వాపోతోంది. దీంతో అంజిబాబు పరిస్థితి కుడితిలో పడ్డ ఎలకలా తయారైందని నియోజకవర్గంలో చర్చించుకుంటున్నారు.

ఉండి బరిలో కలవపూడి శివ

ఉండి నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు (కలవపూడి శివ) తిరుగుబావుటా ఎగురవేయడంతో కూటమి గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయ్యింది. టిక్కెట్ కేటాయింపుపై చంద్రబాబు తనను సంప్రదించకపోవడం ఎంతో వేదనకు గురిచేసిందన్న ఆయన ఉండి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని ప్రకటించారు. ఆ మేరకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో తనకున్న పరిచయాలతో కేడర్‌ను సమాయత్తం చేసుకుంటూ టీడీపీ రెబల్‌గా బరిలో దిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పవన్‌కళ్యాణ్ కేవలం 21 సీట్లుకే పరిమితం కావడం పట్ల జనసేన కేడర్ టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపడం లేదు. మిత్రపక్షం కేడర్ కలిసిరాకపోవడంతో టీడీపీ నాయకులే ఇక్కడ ఆ పార్టీ జెండాలు వెంటేసుకుని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం



భీమలాపురంలో అభివాదం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: ఎన్ని పార్టీలు కలసి వచ్చినా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం ఆచంట మండలం కోడేరు, భీమలాపురంలో ఇంటింటికి శంఖారావం పాదయాత్ర నిర్వహించారు. కోడేరు, భీమలాపురంలో ప్రజలు నీరాజనం పట్టారు. అడగుడుగునా మహిళలు జేజేలు పలికారు. సీఎం జగన్‌దే విజయమంటూ యువత కేరింతలు కొట్టింది. చంద్రబాబు ఏనాడూ మాట నిలుపుకోలేదని, మరోసారి మహిళలను మోసం చేయడానికి వాగ్దానాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబును మహిళలు నమ్మే స్థితిలో లేరన్నారు. బడుగు, బలహీన, దళిత వర్గాలు వైఎస్సార్ సీపీ వెంటే ఉన్నాయని రంగనాథరాజు అన్నారు. జిల్లాలో ఏ ఒక్క సీటు మహిళలకు కేటాయించకుండా మహిళలకు చంద్రబాబు ఎక్కడ న్యాయం చేస్తారంటూ ప్రశ్నించారు. మరింత సంక్షేమం కోసం సీఎం జగన్‌కు అండగా ఉండాలన్నారు. ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, నియోజకవర్గ వలంటీరు కన్వీనరు కర్రి అనురాధ జోగిరెడ్డి, కార్పొరేషన్ డైరక్టర్లు బొక్కా అరుణ, పోతుమూడి రామచంద్రరావు, సర్పంచ్‌లు జక్కంశెట్టి శ్రీరాములు, బోడపాటి బుల్లియ్య, కోడేరు పార్టీ నాయకులు బొంతు శ్రీను, దేవరపు సూర్యనారాయణ, బళ్ల జోగి సత్యనారాయణ, మొల్లేటి రాంబాబు, మేడిది రెడ్డియ్య, మొల్లేటి అచ్చారావు, పమ్మి సురేష్, పమ్మి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పిల్లల చదువుతోనే సమాజంలో మార్పు



మొదుగగుంటలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: సమాజంలో పిల్లలు చదువుకుంటేనే మార్పు వస్తుందని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని దండగర్ర, ఉప్పరగూడెం, మొదుగగుంట గ్రామాల్లో పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ కుటుంబం బాగుండాలంటే చదువు అవసరమన్నారు. చదువుకుంటే కుటుంబం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరినీ చదివించేందుకు సీఎం జగన్ ముందుకొచ్చారన్నారు. ఈ క్రమంలోనే పాఠశాలల్లో వారానికి ఆరు రోజులు గుడ్లు, పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. సామాన్య కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఇంగ్లీష్‌లో విద్యార్థులు మాట్లాడుతుంటే ముచ్చటేస్తుందన్నారు. రైతులకు రైతు భరోసా, ప్రకృతి విపత్తుల నుంచి రైతులను కాపాడేందుకు, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ధరల స్థిరీకరణ వంటి ఎన్నో వినూత్న కార్యక్రమాలను అమలు చేసి చూపించారన్నారు. జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, సర్పంచ్ దండే కనకబాబు, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకృష్ణకుమారి, సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, వీరమళ్ల వెంకన్న, యాతం సత్యనారాయణ, ములగాల గంగారావు, కామన చంద్రరావు, దాకే పండియ్య, గజ్జరపు రామకృష్ణ, అడ్డాల గోపీకృష్ణ, కంఠమని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉండాలి



ఎస్పీ అజిత

భీమవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా ట్రోలింగ్‌లను తీవ్రంగా పరిగణిస్తామని ఎస్పీ వేజెండ్ల అజిత హెచ్చరించారు. బుధవారం భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతూ.. సామాన్యులను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియా వేధింపులు, ట్రోలింగ్‌లు పోలీస్ శాఖ తీవ్రంగా పరిగణిస్తుందని ఐపీ అడ్రస్ ద్వారా గుర్తించి కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రోలింగ్స్, తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో అడ్మిన్లు బాధ్యతగా వ్యవహరించాలని ఆయా గ్రూపుల్లో ప్రతి పోస్టుకి బాధ్యత తీసుకోవాల్సివుంటుందని అజిత తెలిపారు. సభ్యులెవరైనా అభ్యంతకరంగా ప్రవర్తిస్తే వెంటనే గ్రూప్ నుంచి తొలగించాలన్నారు. గ్రూప్ అడ్మిన్స్ వివాదస్పద పోస్టు చేస్తే ఐటీ చట్టం ఐపీసీ సెక్షన్ 153(ఎ) కింద మూడు నుంచి ఐదేళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశముంటుందన్నారు. మహిళలను లక్ష్యంగా చేసుకొని వేధించినా సోషల్ మీడియా వేదికల ద్వారా అదేపనిగా సంప్రదించడం, వెంటపడి దూషించడం, అవమానించడం వంటి వాటిని తీవ్రమైన నేరంగా పరిగణిస్తామన్నారు.

'పది' పరీక్షకు 96 శాతం హాజరు



భీమవరంలోని పీఎస్ఎమ్ గరల్స్ హైస్కూల్ వద్ద పరీక్షకు హాజరైన విద్యార్థులు

భీమవరం: జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పది పబ్లిక్ పరీక్షకు 96.87 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. బుధవారం ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించగా 21,238 మంది విద్యార్థులకు 20,573 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఆరు కేంద్రాలను, జిల్లా విద్యాశాఖాధికారి 8 కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఆరు కేంద్రాలను తనిఖీ చేశారు.

రబీకి సీలేరు జలాలు

మోతుగూడెం (అల్లూరి జిల్లా): లోయర్ సీలేరు జల విద్యుత్ కేంద్రాల నుంచి రబీ అవసరాలు ఉభయగోదావరి జిల్లాలకు బుధవారం నుంచి 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు చీఫ్ ఇంజినీర్ శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలకృష్ణ తెలిపారు. జల విద్యుత్ ఉత్పత్తి అనంతరం నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు ఆదేశాల మేరకు రోజుకు నాలుగు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు చెప్పారు.

ఇరగవరంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



ఇరగవరంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: జనం కోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎత్తిన జెండా వైఎస్సార్‌సీపీ జెండా అని, ఆ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర పౌరసరాఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఇరగవరం మండలం ఇరగవరంలో మండల పార్టీ కార్యాలయం మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. మండలంలో బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు చేసిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 99 శాతం ఎన్నికల హామీలు నేరవేర్చి ప్రజా క్షేత్రంలో మళ్లీ సీఎం కావడానికి సీఎం జగన్ ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా పార్టీ కార్యాలయం దగ్గరకు వచ్చి నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. మళ్లీ సంక్షేమ పాలన కావాలంటే ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గుడూరి ఉమాబాలను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ కొప్పిశెట్టి మంగతాయారు, పార్టీ మండల అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, సొసైటి అధ్యక్షుడు చవ్వాకులు శ్రీనివాస్, ఎంపీటీసీలు మంగెన రామానాయుడు, పాలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎం జగన్‌కే పట్టం

పాలకొల్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల గోపి



పాలకొల్లు 5వ వార్డులో రిక్షా కార్మికుడికి నవరత్నాల బ్రోచర్ అందిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)



పాతపాడులో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌తో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

పాలకొల్లు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ఓటు వేసి రుణం తీర్చుకోవడానికి లబ్ధిదారులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. పాలకొల్లు పట్టణంలోని 5వ వార్డులో బుధవారం ఆయన ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. 5వ వార్డులోని రంగమన్నార్‌పేట, పాత ఎస్‌బీఐ వీధి, రత్నం టాకీసు వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ గత ఐదేళ్ల నుంచి సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. లబ్ధి పొందిన ప్రజలు మళ్లీ సీఎంగా జగన్‌ని ఎన్నుకోవడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. పాలకొల్లు నియోజకవర్గంలో పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. పేదలకిచ్చిన ఇంటిస్థలాలు పూడుస్తుంటే అడ్డుకున్నారన్నారు. దగ్గులూరులో మెడికల్ కళాశాల పూడిక పనులకు అడ్డుకున్నారన్నారు. టిడ్కో లబ్ధిదారులకు ఇంటి ప్లాట్‌లు అప్పగిస్తుంటే అడ్డుతగిలారని, టిడ్కో గృహ సముదాయాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేస్తుంటే ఆ పనికి కూడా ఎమ్మెల్యే నిమ్మల అడ్డుతగిలారన్నారు.

దమ్మయ్యపత్తి, బెజవాడు కోడు ప్రక్షాళన చేస్తా

పట్టణంలో మురుగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి దమ్మయ్యపత్తి, బెజవాడ కోడు డ్రెయిన్‌లను మరమ్మతు చేస్తానన్నారు. దీనికి అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి తక్షణం మంజూరు చేసి పనులు త్వరలో పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట డీసీఎంస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, వార్డు ఇన్‌చార్జ్ జమ్ము కాశీ, వార్డు నాయకులు గొర్రెల మణికంఠ, కూతా నరేంద్రరెడ్డి, కోమర్తి రాజగోపాలం, మీసాల చక్రి, కొంపెల్ల సత్యనారాయణ, లొక్కు వెంకటేష్, ఉప్పలపు రమణ తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమ పాలన

మొగల్తూరు: దేశంలో గడపగడపకు సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని, రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నకు మద్దతు పలకాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. మండలంలోని పాతపాడులో బుధవారం ప్రజాశ్వీరాద ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రసాదరాజు, ఆయన తనయుడు శ్రీకృష్ణంరాజుకు గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ప్రసాదరాజు, ఆయన కుమారుడు, పార్టీ నాయకులు గ్రామంలోని వీర్ల వెంకమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో ఇందిరమ్మ కాలనీలో 85 ఇళ్లు నిర్మించామని, తిరిగి ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఇదే గ్రామంలోని జగనన్న కాలనీలో 57 ఇళ్ళు నిర్మించారన్నారు. కులాలు, మతాలకతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ఘనత జగన్ మోహన్ రెడ్డిదేనన్నారు. పాతపాడు గ్రామంలో నూతనంగా సచివాలయ భవనం, రైతు భరోసాకేంద్రం, ఆరోగ్య కేంద్రం, నాడు నేడులో పాఠశాలలు అభివృద్ధి చేసుకున్నామన్నారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా పాలన అందిస్తున్న తమను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ బృందాలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించాలని, సీ విజిల్ ద్వారా ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సంబంధిత జిల్లా అధికారులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని నిష్పక్షపాతంగా అమలు చేయాలన్నారు. నియోజక వర్గాలువారీగా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, ఏ విధంగా పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టుల నుంచి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై తక్షణం విచారణ చేసి తీసుకున్న చర్యలపై పూర్తి స్థాయి నివేదికలు సమర్పించాలన్నారు. సి. విజిల్ ద్వారా అందిన ఫిర్యాదులను పరిశీలించి, తీసుకున్న చర్యలను నివేదించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై అందిన ఫిర్యాదులను నియోజకవర్గ స్థాయిలోనే పరిష్కరించాలని అప్పుడే ప్రజల్లో అధికారులపై మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ కార్యాలయ భవనాలు, ప్రభుత్వ సంస్థల భవనాలు, ప్రైవేటు భవనాలపై ఎలాంటి రాజకీయ పార్టీల హోర్డింగ్స్, పోస్టర్లు, ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, గృహ నిర్మాణ శాఖ పీడీ కానాల సంగీత్ మాథుర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

● రమణీయం.. రథోత్సవం



తణుకు టౌన్: దువ్వలో వేణుగోపాలస్వామి రథోత్సవం



అత్తిలి: బల్లిపాడులో మదనగోపాలస్వామి రథోత్సవం

జయ జనార్దనా కృష్ణా.. నంద నందనా కృష్ణా.. స్మరణలు మార్మోగాయి.. శ్రీకృష్ణుడి రథోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. అత్తిలి మండలం బల్లిపాడులో మదనగోపాలస్వామి రథోత్సవం, తణుకు మండలం దువ్వలో రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి రథోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం రథోత్సవాలు జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన రథాలపై స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి బాణసంచా కాల్పులు, మేళతాళాల నడుమ రథోత్సవాలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- అత్తిలి/తణుకు టౌన్

లోతట్టు ప్రాంతాలు జలమయం



తణుకు పట్టణంలో కురుస్తున్న వర్షం



రాష్ట్రపతి రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

తణుకు: తణుకు పట్టణంలో బుధవారం భారీ వర్షం దంచికొట్టింది. గత కొద్ది రోజులుగా ఎండవేడిమి ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ఈ వర్షం ఊరటనిచ్చింది. బుధవారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా.. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణం మరి ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. దాదాపు మూడు గంటల పాటు కురిసిన వర్షంతో తణుకు పరిసర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రోడ్లు సైతం మునగడంతో చిరువ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతో ఒక్కసారిగా వాతావరణం మారింది. చలిగాలుల తీవ్రత అధికమైంది. మరోవైపు బుధవారం కురిసిన వర్షంతో రాష్ట్రపతి రోడ్డు, బ్యాంకు కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఎన్జీవో కాలనీ, ఇరగవరం కాలనీలతోపాటు ఉండ్రాజవరం జంక్షన్ వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది.

క్లుప్తంగా

ఏడుస్తూ వచ్చారు.. ఫోన్‌తో ఉడాయించారు

నరసాపురం: కాల్ చేసుకుంటామని చెప్పి ఓ వ్యక్తి నుంచి ఫోన్ తీసుకుని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై పరారయ్యారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన చిత్రసేన మునిసిపాలిటీలో శానిటేషన్ ట్రక్కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం జె.సికిలే స్కూల్ రోడ్డులో నడిచి వెళుతున్నాడు. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు ఏడుస్తూ వచ్చి జాతరలో తమ అబ్బాయి తప్పిపోయాడని, బంధువులకు సమాచారం ఇవ్వాలని, ఒకసారి ఫోన్ ఇవ్వాలని చిత్రసేనను కోరారు. దీంతో అతను ఫోన్ ఇవ్వగా, కాల్ చేస్తున్నట్లు నటిస్తూ పక్కనే పార్కు చేసి ఉన్న బైక్‌ను స్టార్ట్ చేసుకుని ఫోన్‌తో ఉడాయించారు. దీంతో బాధితుడు లబోదిబో మంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉత్తమ సాంకేతిక ప్రాజెక్టులకు అవార్డులు

భీమవరం: ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులు తయారుచేసిన ఉత్తమ సైన్స్, సాంకేతిక ప్రాజెక్టు నమూనాలను పెదనిండ్రకొలను మహాత్మాగాంధీ భవనంలోని మ్యూజియంలో ప్రదర్శనకు ఏర్పాటు చేస్తామని జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ప్రాజెక్టు వివరాలను ఫొటోతో ఈనెలాఖరులోపు పంపించాలని ఎంపికైన ప్రాజెక్టులకు గాంధీస్మారక అవార్డులు అందజేస్తామని ప్రసాదరాజు తెలిపారు.


వైఎస్సార్ సీపీ బస్సు యాత్రకు మద్దతు


చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలో ఈనెల 27 నుంచి ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన ఎన్నికల ప్రచార బస్సు యాత్రకు మాల మహానాడు పూర్తి మద్దతు తెలుపుతుందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. బుధవారం ఆయన తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ బస్సు యాత్రలు, సభలను మాల మహానాడు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల హామీలు అన్ని నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. దీంతో ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లి ఓట్లు అడిగే సత్తాను వైఎస్సార్ సీపీ నాయకులు సాధించారన్నారు. చంద్రబాబు అండ్ టీంకు ప్రజల వద్దకు వెళ్లే పరిస్థితి లేదని, ఒంటరిగా పోటీచేస్తే టీడీపీకి ఓటమి తప్పదని, బీజేపీ, జనసేనను వెంట వేసుకుని తిరుగుతున్నారని విమర్శించారు. పొత్తు కూటమికి బుద్ధి చెప్పాలని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

అడవులపైనే మానవుని భవిత

- వాతావరణ సమతుల్యతకు అడవుల పాత్ర కీలకం
- పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదం
- రానురాను తగ్గుతున్న అడవుల విస్తీర్ణం
- అడవుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.32 లక్షల హెక్టార్లలో అడవి
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం


పశ్చిమ మన్యంలో అటవీ ప్రాంతం

బుట్టాయగూడెం: భారీ వృక్షాలు, ఎత్తైన కొండలు, లోయలు, వాగులు, వంకలు, సెలయేళ్లు, వన్యమృగాలు, పచ్చని అందాలతో అలరారే అడవుల మనుగడ రానురాను ప్రశ్నార్థకమవుతోంది. ప్రజల్లో అవగాహన లోపం వల్ల అడవుల విస్తీర్ణం రానురాను తగ్గిపోతోంది. మానవుల మనుగడలో అడవుల పాత్ర ఎంతో కీలకం. కాలుష్య నివారణ, స్వచ్ఛమైన గాలి, నీటి సంరక్షణకు అడవుల ప్రాముఖ్యత చాలా ఉంది. అడవుల సంరక్షణ కోసం ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నా యథేచ్ఛగా అడవిలో చెట్లను నరికి కలపను అక్రమంగా తరలించేస్తున్నారు. కలప అక్రమ రవాణా పై అధికారులు ప్రత్యేక నిఘాతో కేసులు పెట్టి నిందితులను పట్టుకున్నా కలప అక్రమ రవాణా ఆగడం లేదు. అంతరించిపోతున్న అడవులపై ప్రజలకు అవగాహన కల్పించడానికి మొదటిసారిగా ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 1971లో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ప్రారంభించారు. మన దేశంలో 2013 మార్చి 21వ తేది అటవీ దినోత్సవం నిర్వహించారు. అప్పటి నుంచి అడవులపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రతి ఒక్కరూ చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకోవాలి. ముఖ్యంగా అడవుల సంరక్షణ బాధ్యత అందరిపై ఉంది.

85 శాతం ఏజెన్సీలోనే..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా అడవి విస్తీర్ణం 1.32 లక్షల హెక్టార్లల్లో విస్తరించి ఉంది. ప్రభుత్వం లెక్కల ప్రకారం అధికంగా 85 శాతం అడవి ఏజెన్సీ ప్రాంతంలోనే ఉంది. బుట్టాయగూడెం, కుక్కునూరు, పోలవరం, వేలేరుపాడు, జీలుగుమిల్లి ఐదు గిరిజన మండలాల్లో 1,12,445 హెక్టార్లలో విస్తరించి ఉంది. జిల్లాలోని ఇతర మండలాల్లో అటవీ విస్తీర్ణం వివరాలను పరిశీలిస్తే.. బుట్టాయగూడెం మండలంలో 21,879 హెక్టార్లు, పోలవరం మండలంలో 27,927, హెక్టార్లు, జీలుగుమిల్లిలో 8,903, వేలేరుపాడులో 29,476 హెక్టార్లు, కుక్కునూరులో 22,259, టి.నర్సాపురంలో 4,384, చింతలపూడిలో 6,580, కామవరపుకోటలో 1,178, లింగపాలెంలో 2,119, గోపాలపురంలో 649, ద్వారకాతిరుమలలో 813, నల్లజర్లలో 2,174, పెదవేగిలో 1,332, ఉంగుటూరు మండలంలో 1,226 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒకప్పుడు 23 శాతంగా ఉన్న అడవులు ప్రస్తుతం 22.02 శాతానికి తగ్గినట్టు తెలుస్తోంది.

పర్యావరణ పరిరక్షణలో కీలకం

కార్బన్ వాయువులను పీల్చుకోవడంలో అడవులు కీలకపాత్ర పోషిస్తున్నాయని గతంలో జరిగిన అనేక పరిశోధనల్లో తేలాయి. వాటిని నమ్మి ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రదేశాల్లో అడవులను పెంచడం ప్రారంభించారు. అలాగే సహజసిద్ధంగా కూడా అడవులు ఉన్నాయి. వాతావరణంలోని కార్బన్ డైయాక్సైడ్, ఆక్సిజన్ సమతుల్యతలను కాపాడడంలో అడవులు కీలకపాత్ర పోషిస్తాయి. అదేవిధంగా అడవులు జంతుజలాలకు నిలయంగా ఉన్నాయి. అలాగే పెరుగుతున్న గాలి ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో కూడా అడవులు సహాయపడతాయి. తద్వారా వాతావరణాన్ని చల్లగా, వెచ్చగా ఉంచుతుంది. ఇలా ఎంతో ఉపయోగకరమైన అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

చెట్లు నరికితే కఠిన శిక్షలు

అడవులను కాపాడుకుంటేనే రేపటి తరాలు ఆనందంగా, ఆరోగ్యంగా జీవించగలరు. అడవిలో చెట్లను నరికితే కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అడవుల్లో ఉన్న ఇరుగుడు సేవ, టేకు వంటి విలువైన వృక్షాలను నరికిన వ్యక్తులను ఫారెస్ట్ అధికారులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుస్తారు. కోర్టులో నేరం రుజువైతే సుమారు ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే వృక్షానికి వెలకట్టి దానిని 10 రెట్ల మేర జరిమానా విధించే అవకాశం కూడా ఉంది. అయితే అభయారణ్యంలో చెట్లు నరికినా, వన్యప్రాణులను వేటాడినా కఠినమైన శిక్షలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అడవుల రక్షణకు ప్రజలు సహకరించాలి



అడవుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అడవుల్లో చెట్ల నరికివేతపై నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే అనేక మందిని పట్టుకుని కేసులు నమోదు చేశాం. అడవిలో ప్రవేశించకుండా అడవి చుట్టూ రక్షణ ఏర్పాటు చేస్తున్నాం. అదేవిధంగా అడవులు అంతరించిపోతే కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగిస్తున్నాం. అదేవిధంగా చెట్లు నాటే కార్యక్రమాన్ని కూడా చేస్తున్నాం. ప్రజలందరూ సహకరించాలి.

– దావీదు రాజు నాయుడు, ఫారెస్ట్ రేంజ్ అధికారి, పోలవరం

జలదుర్గా గోకర్ణేశ్వరుని కల్యాణం చూతము రారండి

- నేడు కొల్లేటికోటలో కల్యాణ మహోత్సవం
- కొత్తగా ఎడ్లబండిపై పంచభోగ ప్రసాదాలు


పెద్దింట్లమ్మకు ఈ ఏడాది నుంచి పంచ భోగ ప్రసాదాలు పంపిణీ ఊహా చిత్రం


కొల్లేటికోట పెద్దింట్లమ్మకు బోనాలు (ఫైల్)


కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతర (తీర్థం) మహోత్సవం వైభవోపేతంగా కొనసాగుతోంది. జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామి కల్యాణం గురువారం రాత్రి నిర్వహించనున్నారు. కల్యాణోత్సవానికి సంబంధించి ఏర్పాట్లను దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే పూర్తి చేశారు. సమీప గోకర్ణపురం నుంచి గోకర్ణేశ్వర స్వామి (శివుడు)ను పల్లకీలో ఊరేగింపుగా తీసుకు వచ్చి జలదుర్గాదేవీ (పార్వతీ)తో కల్యాణం జరపడం 11వ శతాబ్దం నాటి వేంగి–చాళుక్యరాజుల కాలం నుంచి జరుగుతోంది. దేశవిదేశాల నుంచి, ఇతర జిల్లాలు, కొల్లేరు గ్రామాల నంచి ప్రతి కుటుంబం కల్యాణాన్ని తిలకించేందుకు తరలిరానుంది. ఈ ఏడాది ప్రత్యేకంగా అతిపెద్ద మహా అనివేటి మండపం నిర్మాణం పూర్తి కాగా, జాతరకు వచ్చే భక్తుల రాకపోకలకు వీలుగా సర్కారు కాలువపై పెద్దింట్లమ్మ వారధి నిర్మించారు. ఆలయ ఈవో కేవీ గోపాలరావు ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును తెనాలికి చెందిన రాము గుర్కుల్, వేదపారాయణాన్ని విశ్వేశ్వరశర్మ, కల్యాణ వ్యాఖ్యానము ఏలూరు రామకృష్ణ శర్మ నిర్వహించనున్నారు. కల్యాణం నిమిత్తం సీఐ బి.కృష్ణకుమార్ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.

పెద్దింట్లమ్మకు పంచభోగ ప్రసాదాలు

తెలంగాణలో బోనాల సంప్రదాయాన్ని ఐదేళ్లుగా కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరలో కల్యాణం రోజున నిర్వహిస్తున్నారు. దీనిని పురస్కరించుకుని ఈ ఏడాది నుంచి పందిరిపల్లిగూడెం నుంచి పంచభోగ ప్రసాదాలు (చక్కెర పొంగలి, పులిహోరా, గారె, బూరి, బూందీ) గురువారం రాత్రి 8.30 గంటలకు గ్రామ సర్పంచ్ బలే వెంకటరమణ సముద్రుడు, బోనాల నిర్వాహకుడు బాలాజీ ఆధ్వర్యంలో ఎడ్లబండిపై ఊరేగింపుగా తీసుకురానున్నారు. కల్యాణం తిలకించడానికి వచ్చిన భక్తులకు వీటిని నైవేద్యంగా అందించనున్నారు. ఇకపై ప్రతి ఏటా ఈ సంప్రదాయం కొనసాగనుంది. మరోవైపు ఏలూరు జిల్లాలోని కొల్లేరు గ్రామాలకు చెందిన అన్ని గ్రామాల మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పందిరిపల్లిగూడెం నుంచి ప్రభల బండి, బోనాల గ్రామోత్సవం జరగనుంది. కల్యాణం రోజున నాదస్వరవాయిద్యం, గరగ నృత్యం, శక్తివేషాలు ప్రదర్శనలు ఏర్పాటు చేశాం. దేవదాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– కేవీ గోపాలరావు, ఈఓ, పెద్దింట్లమ్మ దేవస్థానం, కొల్లేటికోట

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బైక్

- భర్త మృతి, భార్య, కుమార్తెకు గాయాలు
- తుని నుంచి వెలమావారిపాలెం వెళుతుండగా ఘటన
- ఏలూరు సమీపంలో హైవే వద్ద ప్రమాదం

ఏలూరు టౌన్: ద్విచక్రవాహనంపై వెళుతూ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా, భార్య, కుమార్తెకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా చవలపురం మండలం వెలమావారి పాలెంనకు చెందిన ఉయ్యాల రమేష్ (28), భార్య వెంకట లక్ష్మి, ఏడాదిన్నర వయస్సు ఉన్న హర్షశ్రీ అనే కుమార్తె ఉన్నారు. కూలీ పనుల నిమిత్తం కొంత కాలం క్రితం తుని వెళ్ళి తిరిగి బుధవారం ఉదయం మోటారు సైకిల్‌పై భార్య, కుమార్తెతో కలిసి స్వగ్రామానికి బయలుదేరారు. 16వ నంబర్ జాతీయ రహదారిపై వెళుతుండగా ఏలూరు సమీపంలో ఓ హోటల్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రమేష్ అక్కడికక్కడే మృతి చెందగా, భార్య, కుమార్తెకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్సై కె రాజారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి


సత్యనారాయణ మృతదేహం

ఏలూరు రూరల్: పిడుగుపాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని చొదిమెళ్లలో పిడుగులు పడ్డాయి. భీకరమైన శబ్దంతో కూడిన ఓ పిడుగు తాటిచెట్టు సమీపంలో పడింది. అదే సమయంలో అక్కడ సంచరిస్తున్న రావూరి సత్యనారాయణ అనే వ్యక్తి పిడుగుపాటుకు గురయ్యాడు. స్థానికులు గుర్తించి హుటాహుటిన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. పిడుగు కారణంగా తాటిచెట్టుకు నిప్పు అంటుకుంది.

సొసైటీలో ఎన్ఎంఆర్ ఉద్యోగుల తొలగింపు

సొసైటీ గేటు వద్ద ఆందోళన

భీమడోలు: గుండుగొలను సొసైటీలో నిబంధనలకు విరుద్ధంగా నియమితులైన 9 మంది ఎన్ఎంఆర్ ఉద్యోగులను కో–ఆపరేటివ్ చట్టం అనుసరించి వారిని విధుల నుంచి మంగళవారం తొలగించారు. ఈ తరుణంలో బుధవారం కొందరు ఉద్యోగులు సొసైటీ ప్రధాన గేటు వద్ద బైఠాయించి సొసైటీ రెగ్యులర్ ఉద్యోగులను లోనికి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. తమను అన్యాయంగా తొలగించారని, తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సొసైటీ కార్యదర్శి రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనంతరం పోలీసులు వచ్చి వారితో చర్చించి ఆందోళన విరమింప చేశారు. దీనిపై కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ తొలగింపబడిన 9 మంది అవుట్‌సోర్సింగ్‌లోని ఎన్ఎంఆర్ ఉద్యోగులకు నియామక పత్రాలు, సరైన ధ్రువీకరణ పత్రాలు, జాయినింగ్ ఆర్డర్లు లేవన్నారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు

ఉండిలో విలేకరుల సమావేశంలో జేసీ ప్రవీణ్ ఆదిత్య


ఉండిలో మాట్లాడుతున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

ఉండి: ఎన్నికల కోడ్‌ను అతిక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య హెచ్చరించారు. బుధవారం ఉండి ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల నియమావళిపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేసీ మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో నాలుగు ఫ్లయింగ్‌స్క్వాడ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్స్ మూడు, వీడియో సర్వే లైన్ టీమ్స్, వ్యూయింగ్ టీమ్స్‌ను ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి మండలంలో ఎంపీడీఓ, తహసీల్దార్, ఆకివీడు మున్సిపల్ కమిషనర్‌ను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమించడం జరిగిందన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించామన్నారు. సీ విజిల్ యాప్‌ను ప్రజలు డౌన్‌లోడ్ చేసుకుని ఎక్కడైతే నిబంధనలను అతిక్రమిస్తున్నారో వాటిని ఈ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు దృష్టికి తీసుకువస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ స్థలాల్లో ఎక్కడైనా ఫ్లెక్సీలు వంటివి ఏర్పాటు చేసుకోవాలంటే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అలాగే ర్యాలీ, ప్రచారాలు వంటివి చేయాలంటే అనుమతి తీసుకోవాలన్నారు. ఉండి ఎంపీడీవో కార్యాలయంలో సింగిల్‌విండో ద్వారా అనుమతులు ఇస్తామన్నారు. సువిధ అనే పోర్టల్ ద్వారా ధరఖాస్తు చేస్తే 48 గంటల తరువాత అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే మద్యం, నగదు అక్రమంగా తరలించే వారిపై కఠినంగా చర్యలు ఉంటాయన్నారు. చిన్నపిల్లలను ప్రచారానికి, సభలకు తరలించడం నిషిద్ధమని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కె.శ్రీనివాస్ ఉన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

భీమవరం: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. భీమవరం వన్‌టౌన్‌లోని నర్సయ్య అగ్రహారానికి చెందిన కలిగి శ్రీలత (26), అదే ప్రాంతానికి చెందిన రమేష్ ఎనిమిదేళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. తాపీ పని చేసే భర్త బుధవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి శ్రీలత సమీపంలోని ఆమె పుట్టింటికి వెళ్లింది. ఆమె ఇంటికి వచ్చిన తర్వాత భార్యాభర్తలు ఘర్షణ పడ్డారు. ఆ తర్వాత వంట గదిలోకి వెళ్లి శ్రీలత ఎంతకూ బయటకు రాకపోవడంతో భర్త వెళ్లి చూసేసరికి షెడ్డులో ఉరికి వేలాడుతూ ఉంది. వెంటనే ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ అడబాల శ్రీను కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

పది పరీక్షలకు పటిష్ట బందోబస్తు

ఏలూరు (టూటౌన్): ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఎస్పీ సుడిగాలి పర్యటన ద్వారా బుధవారం సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే వారిపైచట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు. ఎస్పీ వెంట ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, ఎస్సై లక్ష్మణ్ బాబు పాల్గొన్నారు.

పేకాట కేసులో టీడీపీ నేతల అరెస్ట్?

ఏలూరు టౌన్: ఏలూరు పోణంగి రోడ్డులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి బుధవారం చెప్పారు. నిందితుల నుంచి రూ.13,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అరెస్ట్ అయిన నిందితుల్లో టీడీపీ నేతలు ఉన్నట్లు సమాచారం.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం లభ్యం

ఏలూరు టౌన్: అనుమానాస్పద స్థితిలో రైలు పట్టాలపై ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. కృష్ణా జిల్లా తేలప్రోలుకు చెందిన మంగదుడ్డి సుధాకర్‌కు భార్య రజని, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. బుధవారం ఉదయం అతను తేలప్రోలు రైల్వేస్టేషన్ రైల్వే గేటు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతానికి తాపీ కూలీ దుర్మరణం


సాలా కృష్ణ (ఫైల్)

పాలకొల్లు అర్బన్: టీ స్టాల్ వద్ద ఫ్లెక్సీ కడుతుండగా విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పాలకొల్లు రూరల్ హెచ్‌సీ డి.రాంబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లంకలకోడేరుకు చెందిన సాలా కృష్ణ, మల్లిపూడి అరుణ్‌కుమార్ తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో కొత్తగా టీ దుకాణం పెట్టుకున్న స్నేహితుడికి సహకరించేందుకు ఫ్లెక్సీ కట్టేందుకు వారు ముందుకు వచ్చారు. బుధవారం దుకాణం వద్ద వీరిద్దరూ ఫ్లెక్సీ కడుతుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలోనే కృష్ణ మృతి చెందగా, అరుణ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని చికిత్స నిమిత్తం పాలకొల్లులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ చెప్పారు.

ఏప్రిల్‌లో ఉపకరణాల నిర్ధారణ శిబిరాలు


భీమవరంలోని భవిత దివ్యాంగుల శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్యామ్‌సుందర్, రాధిక

భీమవరం: సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగ పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేసేందుకు ఏప్రిల్‌లో వైద్య నిర్ధారణ శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్, సహిత విద్య రాష్ట్ర సహాయ సమన్వయకర్త డాక్టర్ ఎస్.రాధిక చెప్పారు. బుధవారం పట్టణంలోని భవిత శిక్షణా కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రత్యేక ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సహిత విద్య రిసోర్స్ పర్సన్స్ దివ్యాంగ పిల్లల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వైద్య నిర్ధారణ శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా పాటుపడాలన్నారు. డాక్టర్ రాధిక మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ అనంతరం సామర్థ్యాలు అభివృద్ధి చెందిన పిల్లలను మెయిన్ స్ట్రీమ్ చేయాలన్నారు. జిల్లా సహిత విద్య, సమన్వయకర్త సీహెచ్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, సహిత విద్య సహాయ సమన్వయకర్త టి.శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్స్ లిల్లీ గ్రేస్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇద్దరిపై కత్తితో దాడి

ఏలూరు టౌన్: విదేశాల్లో వైద్య విద్య అభ్యసిస్తున్న ఓ యువకుడు మద్యం మత్తులో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులపై కత్తితో దాడికి తెగబడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన పాలడుగు చాణుక్య విదేశాల్లో వైద్య విద్యను అభ్యసిస్తుండగా ఆఖరి పరీక్ష రాయాల్సి ఉంది. ప్రస్తుతం చాణుక్య ఏలూరులో ఉంటున్నాడు. ఇంటి పక్కన జాలిపూడికి చెందిన ఎస్.దుర్గాసురేష్ వడ్రంగి పనిచేస్తున్నాడు. మిషనరీ శబ్దం వస్తోందని పని ఆపేయాలని చాణుక్య చెప్పాడు. అయితే పనిచేసేటప్పుడు శబ్దం వస్తుందని సురేష్ చెప్పడంతో ఆగ్రహించిన చాణుక్య తనతో తెచ్చుకున్న చాకుతో రెండు చేతులపై, వీపుపై సురేష్‌ను పొడిచాడు. గాయాలపాలైన దుర్గాసురేష్‌ను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మరో ఘటనలో బుధవారం మధ్యాహ్నం పత్తేబాద డీమార్ట్ సమీపంలో కారులో వెళుతున్న ఓ వ్యక్తి హార్న్ కొట్టాడు. అదే సమయంలో మోటారు సైకిల్‌పై వస్తున్న చాణుక్య ఆగ్రహించి వెంటనే తన బ్యాగ్‌లో ఉన్న కత్తి తీసి కారు నడిపే వ్యక్తిపై దాడి చేసి వేలు, చేతులపై పొడిచాడు. దీంతో ఇరుగుపొరుగు వారు అతన్ని నిర్బంధించి టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. రెండు ఘటనలపై ఏలూరు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ రాయితీలతో సంక్షేమం

- తణుకు నియోజకవర్గంలో రూ. 124.79 కోట్లు విద్యుత్ రాయితీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్సీఎస్టీ, నాయీ బ్రాహ్మణ, రైతాంగం
- గతంలో ఎన్నడూలేదంటున్న వైనం


అత్తిలిలో ఆక్వా చెరువు


తణుకులో విద్యుత్ సబ్సిడీతో నడుస్తున్న సెలూన్ షాపు

తణుకు అర్బన్: విద్యుత్ వాడకంలో రాయితీ రూపంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం ఆయా వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. అర్హులైన ఆక్వారంగ రైతాంగంతోపాటు ఎస్సీ, ఎస్టీలు, నాయి బ్రాహ్మణులు, వ్యవసాయరంగ రైతాంగం విద్యుత్ రాయితీలు పొందుతున్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను రాష్ట్ర వ్యాప్తంగా సంపూర్ణంగా నెరవేర్చడంతో ఆయా వర్గాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. పేద వర్గాలను ఆర్థికంగా ఆదుకోవాలనే సదుద్దేశ్యంతో వారిని పురోగతి బాటలో నడిపించాలని విద్యుత్ బిల్లుల్లో రాయితీలు ప్రకటించారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికార యంత్రాంగం సైతం అర్హులందరికీ విద్యుత్ రాయితీలను అందించడంలో సఫలీకృతం అయ్యారని వినియోగదారులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

విద్యుత్ సంక్షేమం ఇలా..

తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాలీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి ఆక్వా రైతాంగానికి అండగా నిలిచేందుకు యూనిట్‌రేటు రూ.3.50 చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం రూ.2.00లు రాయితీగా ప్రకటించడంతో ఆక్వా రంగంలో ఉన్న రైతాంగానికి కేవలం విద్యుత్ బిల్లులో యూనిట్‌ధర రూ.1.50మాత్రమే చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ వర్గాలు తమ గృహ విద్యుత్ వాడకంలో 200 యూనిట్ల వాడకానికి ఉచితంగా విద్యుత్ సరఫరా ప్రభుత్వం అందజేస్తుంది. నాయి బ్రాహ్మణ కులవృత్తిగా నిర్వహించే సెలూన్‌షాపుల్లో 150 యూనిట్లులోపు వాడే దుకాణాలకు విద్యుత్ బిల్లు లేకుండా విద్యుత్ సరఫరా అందజేస్తుంది. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ రూపంలో రాయితీ అందుతుంది.

తణుకు నియోజకవర్గంలో విద్యుత్ రాయితీ ఇలా..

	ఆక్వా	ఎస్సీ	ఎస్టీ	వ్యవసాయం	సెలూన్
అత్తిలి	రూ.76.58 కోట్లు	రూ. 3.32కోట్లు	రూ.13.48లక్షలు	రూ.53.13లక్షలు	రూ.3.01లక్షలు
ఇరగవరం	రూ.29.43కోట్లు	రూ. 3.33కోట్లు	రూ.8.94లక్షలు	రూ. 2.29 కోట్లు	రూ. 1.02లక్షలు
తణుకు	రూ.55.32లక్షలు	రూ.1.22కోట్లు	రూ.10.30లక్షలు	రూ.65.32లక్షలు	రూ.5.69లక్షలు
తణుకు రూరల్	రూ.5.23లక్షలు.	రూ.3.35కోట్లు	రూ.5.93లక్షలు	రూ. 1.08కోట్లు	రూ. 2.59లక్షలు

రూ. 124.79 కోట్లు రాయితీ...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి తణుకు నియోజకవర్గంలో ఈ 58 నెలల కాలంలో విద్యుత్ రాయితీల రూపంలో రూ. 124.79 కోట్ల రాయితీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా వర్గాలకు అందజేశారు. ఇందులో భాగంగా అత్యధికంగా ఆక్వారంగ రైతాంగానికి రూ. 106.62 కోట్లు విద్యుత్ రాయితీ రూపంలో కేటాయించగా, ఎస్సీ వర్గాలకు రూ. 11.24 కోట్లు, ఎస్టీ వర్గాలకు రూ. 38.67 లక్షలు, వ్యవసాయ రంగంలో ఉచిత విద్యుత్ రూపంలో రూ. 4.55 కోట్లు రాయితీ రూపంలో ప్రభుత్వం ఇప్పటికే అందజేసింది.

విద్యుత్ రాయితీ చరిత్రాత్మకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమంలో భాగంగా విద్యుత్ రాయితీలతో తణుకు నియోజకవర్గంలో రూ. 124.79 కోట్లు సంక్షేమాన్ని అందించడం చరిత్రాత్మకం. అత్యధికంగా తణుకు నియోజకవర్గంలో రూ. 106.62 కోట్లు ఆక్వారంగ రైతాంగానికి రాయితీ రూపంలో వెసులుబాటు కలిగింది. వ్యవసాయ రైతాంగానికి ఉచిత విద్యుత్, ఎస్సీ, ఎస్టీలు, నాయి బ్రాహ్మణులకు విద్యుత్ రాయితీ ప్రభుత్వం అందజేసింది. తణుకు నియోజకవర్గంలో అత్యధికంగా విద్యుత్ రాయితీలో అత్తిలికి సంబంధించి రూ. 81కోట్లు ఆక్వా, వ్యవసాయ రైతాంగాలకు విద్యుత్ రాయితీ వచ్చిందని చెప్పడానికి గర్వపడుతున్నాను. విద్యుత్ రాయితీలతో కూడా సంక్షేమాన్ని సృష్టించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లబ్ధిదారులు అండగా నిలబడాల్సి ఉంది.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు,
రాష్ట్ర పౌరసరఫరాలు,వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి

వ్యవసాయరంగానికి రూ. 4.55 కోట్ల విద్యుత్ రాయితీ



తణుకు నియోజకవర్గంలో వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ రూపంలో 301 సర్వీసులకుగాను రూ. 4.55 కోట్లు విద్యుత్ రాయితీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు. రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం ఎప్పుడూ ముందువరసలోనే ఉంది. ముఖ్యంగా అర్హులైన రైతులందరికీ ప్రభుత్వ సంక్షేమం అందేలా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి అధికార యంత్రాంగానికి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తుంటారు.

– బోడపాటి వీర్రాజు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు, మండపాక

ఆక్వా రైతుకు విద్యుత్ యూనిట్ ధర రూ. 1.50 మాత్రమే



అత్తిలి, ఇరగవరం మండలాల్లో 30 ఎకరాల్లో విడివిడిగా ఆక్వా సాగు చేస్తున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆక్వా రైతాంగాన్ని ఆదుకునే నేపథ్యంలో విద్యుత్ రాయితీ ప్రకటించారు. దీంతో యూనిట్ అసలు ధర రూ. 3.50 ఉండగా రాయితీ రూపంలో రూ. 2.00 లను తగ్గించి నేడు రూ. 1.50 మాత్రమే యూనిట్ ధర చొప్పున విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నాము. దీంతో ఆక్వా సాగులో పరిస్థితులను బట్టి ఆటు పోటులు ఎదురవుతున్నప్పటికీ నష్టాలబారిన పడకుండా సాగు చేయగలుగుతున్నాం.

– తమ్మాబత్తుల సత్యనారాయణ, అత్తిలి మండల అగ్రికల్చరల్ సలహాసంఘ ఛైర్మన్, స్కిన్నెరపురం

నాయీ బ్రాహ్మణులను సీఎం జగన్ ఆదుకున్నారు



నాయీ బ్రాహ్మణులు కులవృత్తిగా చేస్తున్న సెలూన్ షాపులకు విద్యుత్ రాయితీ ప్రభుత్వం అందజేస్తుంది. 150 యూనిట్లు లోపు వచ్చే సెలూన్ షాపులు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాయితీ ప్రకటించి అమలు చేస్తున్నారు. నాయి బ్రాహ్మణులకు గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని భరోసా సీఎం జగన్ ఇచ్చారు.

– కొట్టాపి శ్రీనివాస్, తణుకు పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం



ఎస్సీ, ఎస్టీల విద్యుత్ బిల్లుల్లో రాయితీ ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా వర్గాలంతా రుణపడి ఉంటాము. కష్టాన్నే నమ్ముకుని జీవిస్తున్న మా వర్గాలకు విద్యుత్ బిల్లుల్లో 200 యూనిట్లు లోపు వాడిన వారికి విద్యుత్ బిల్లు లేకుండా ఉచిత విద్యుత్‌ను అందజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు నుంచి జగనన్నకు మేమంతా రుణపడి ఉండడమే కాకుండా అండగా నిలబడతాం.

– పెనుమాల రాజేష్, వైఎస్సార్ సీపీ తణుకు పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షుడు

క్లుప్తంగా

ఓటర్లను చైతన్యపరుస్తూ పోలీసుల కవాతు


మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ బలగాల కవాతు

తాడేపల్లిగూడెం రూరల్: భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఓటర్లను చైతన్య పరుస్తూ మెట్ట ఉప్పరగూడెంలో సీఐఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఓటర్లలో నమ్మకం కల్పించేలా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం తీసుకొస్తామన్నారు. పీసీ రాజ్ మహదేవ్, ఎస్‌కే.జిలాని, సీఐఎస్ఎఫ్ ఏఎస్సైలు పాల్గొన్నారు.

ఘనంగా పట్టాభిరామ స్వామి విగ్రహ ప్రతిష్ఠ


శ్రీపట్టాభిరామస్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామంలో పట్టాభిరామస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ తరపున కారుమూరి నాగేశ్వరరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంతెన రామలింగరాజు, ఎంపీటీసీ సభ్యుడు సుంకర నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి


లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం ఇస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గల్ఫ్‌దేశాలైన ఉమన్ దేశానికి ఉపాధి నిమిత్తం వెళ్లి అక్కడ హార్ట్‌ఎటాక్‌తో మృతి చెందిన తన తల్లి మల్లేశ్వరి మృతదేహాన్ని ఇండియాకు రప్పించాలని పెంటపాడు గ్రామానికి చెందిన దినేష్, కుటుంబ సభ్యులు బుధవారం పట్టణంలో జరిగిన గల్ఫ్‌హెల్ప్ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ భౌతికకాయాన్ని ఇండియాకు రప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఓటరు లిస్టుల పరిశీలన


పదో వార్డులో ఓటరు లిస్ట్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పదో వార్డు 62–111వ బూత్ పదో వార్డు ఇంచార్జ్ అద్దాల నరసింహారావు, పెనుగొండ ఆంజనేయులు బుధవారం ఇంటింటికీ వెళ్లి ఓటరు లిస్టులపై సర్వే చేశారు. ఓటర్‌లిస్టులో రెండు చోట్లు ఉన్నారా, స్థానికంగా ఉన్నారా, డోర్ నెంబర్‌లలో మార్పులు ఉన్నాయా తదితర విషయాలను ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చల్లపల్లి నాగలక్ష్మి, టెక్కలి ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా రథోత్సవం

అత్తిలి: మండలంలోని రుక్మిణీ, సత్యభామా సమేత మదనగోపాలస్వామి తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. కల్యాణం నిర్వహించిన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను భక్తులు వేకువ జామునుంచే దర్శించుకున్నారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తబృందంచే విష్ణు సహస్రనామ పారాయణం, భజన కార్యక్రమం, శ్రీమదనగోపాల్ మోడల్ స్కూల్ విద్యార్థులచే మురళీ కోలాట భజన, కర్రసాము కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా తీర్థ మహోత్సవానికి హాజరైన వేలాదిమంది భక్తులకు అన్నదానం చేశారు. సత్యసాయి సేవా సమితి సభ్యులు అన్నదాన కార్యక్రమంలో తమ సేవలను అందజేశారు. వైభవోపేతంగా రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవ కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్తిలి ఎస్సై వి రాంబాబు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ల్యాబ్స్ అసోసియేషన్‌కు అండగా ఉంటా

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి


తణుకులో మంత్రి కారుమూరిని కలిసిన తణుకు ల్యాబ్ అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: స్వయం ఉపాధితో జీవనం సాగిస్తున్న తణుకు మెడికల్ ల్యాబ్స్ అసోసియేషన్ ల్యాబ్ టెక్నీషియన్స్‌కు అండగా నిలుస్తానని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం తణుకు మెడికల్ ల్యాబ్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు మంత్రి కారుమూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వైద్యరంగంలో వ్యాధులను గుర్తించడంలో ల్యాబ్ టెక్నీషియన్స్ కీలకపాత్ర పోషిస్తున్నారని మీరందిస్తున్న సేవలు మీకు మంచి చేస్తాయని అన్నారు. తణుకులో కులం, మతం బేధాల్లేకుండా అన్ని వర్గాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు చేయించామన్నారు. మీ అసోసియేషన్ సభ్యులందరూ ఉపయోగించుకునే రీతిలో మంచి భవనాన్ని మీకు నిర్మాణం చేయించి ఇస్తానని హామీ ఇచ్చారు. మంత్రి కారుమూరి ఇచ్చిన హామీ మేరకు అసోసియేషన్ సభ్యులంతా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు మెడికల్ ల్యాబ్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి.వినయ్, ఉపాధ్యక్షుడు గాదంశెట్టి జయకృష్ణ, కార్యదర్శి కె.శ్రీను, కోశాధికారి టీకే గుప్త, సభ్యులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా మదనగోపాలుని కల్యాణం


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, లక్ష్మీకిరణ్ దంపతులు


బల్లిపాడులో మదనగోపాలస్వామి కల్యాణతంతు దృశ్యం

అత్తిలి: జిల్లాలో వైష్ణవ క్షేత్రాలలో ప్రసిద్ధి గాంచిన బల్లిపాడు మదన గోపాలస్వామి కల్యాణోత్సవం మంగళవారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. స్వామివారిని గరుడవాహనంపై, శ్రీరుక్మిణీ సత్యభామా అమ్మవార్లను గజవాహనంపై ఉంచి ఎదురు సన్నాహ గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి పుష్పాలతో అలంకరించిన కల్యాణ మండపంపై స్వామివారి కల్యాణోత్సవ తంతును పెద్దింటి అనిల్‌కుమార్‌ఆచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. అపధర్మ రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, లక్ష్మీకిరణ్ దంపతులు స్వామివారి కల్యాణోత్సవానికి హాజరై తిలకించారు. శ్రీస్వామి,అమ్మవార్లకు కారుమూరి దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈసందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాలనుంచి వేలాదిమంది భక్తులు హాజరైయ్యారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు ఛైర్మన్ తోట వెంకటేశ్వరరావు, సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్‌లు ధనుమూరి తాతాజీ, ఆకుల బులినాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు, అత్తిలి ఏఎంసీ ఛైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, మద్దాల శ్రీనివాస్, రంభ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో బూత్ కమిటీలే కీలకం


వైఎస్సార్ సీపీ బూత్ కార్యకర్తలతో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు

తణుకు టౌన్: గ్రామ స్థాయిలో బూత్ కమిటీలే కీలకమని, ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు చెప్పారు. బుధవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం కోనాల గ్రామంలోని 21, 22 బూత్ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓటు వేసేలా ప్రచారం చేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు, తణుకు నియోజకవర్గం నుంచి కారుమూరి వెంకట నాగేశ్వరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు, ముళ్లపూడి బాబూరావు, గ్రామసర్పంచ్ మళ్లిపూడి చిన్నయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు గూడవల్లి బాబి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుమర్తి చిన్నోడు, నాయకులు గెడ్డ బాబ్జి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కృష్ణపరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు


కృష్ణపరమాత్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమలక ఏకాదశి సందర్భంగా స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణయోగ ధ్యాన మందిరంలో బుధవారం ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. స్వామి వారికి నూతన వస్త్రాలు అలంకరణ, సహస్రనామార్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను మందిర నిర్వాహకులు ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

ఆకుతీగపాడులో కొనసాగుతున్న విద్యార్థుల శ్రమదానం


ఆకుతీగపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పెంటపాడు: ఆకుతీగపాడు గ్రామంలో పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థుల ఆధ్వర్యంలో బుధవారం ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగింది. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేట్టారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి విజయబాబు, కమిటీ సభ్యులు సురేంద్రబాబు, రామచంద్రుడు, కళాశాల సిబ్బందితో పాటు, గ్రామ సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి కొట్టు పరామర్శలు


ఎంపీపీ దాసరి హైమావతిని పరామర్శిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


నల్లిమిల్లి చినవెంకటరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం నియోజకవర్గంలోని పలువురిని పరామర్శించారు. వాసవి ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ చల్లంచర్ల సుబ్బారావు కుటుంబ సభ్యులను మంత్రి కొట్టు పరామర్శించారు. ఈ సందర్భంగా సాయినవదుర్గభారతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెంటపాడు మండల ఎంపీపీ దాసరి హైమావతి మరిది దాసరి సూర్యప్రభాకర్ మృతి చెందారు. ఇటీవల పెంటపాడుకు చెందిన పల్లమిల్లి చినవెంకటరెడ్డి సతీమణి అన్నపూర్ణ మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులను పరామర్శించి మంత్రి కొట్టు ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతి చెందిన ప్రభాకర్, అన్నపూర్ణ, భారతి ఆత్మలకు శాంతి కలగాలని సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, కొట్టు విశాల్, మండల యూత్ ప్రెసిడెంట్ కొవ్వూరి విజయభాస్కరరెడ్డి, పెంటపాడు ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ రెడ్డి సూరిబాబు, మేడపాటి చెల్లారెడ్డ, నల్లమిల్లి అంజిరెడ్డి, దేవాబత్తుల బాబ్జి తదితరులు ఉన్నారు.

వైభవంగా బాల వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

తణుకు టౌన్: పట్టణంలోని పైడిపర్రులో బాల వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ఈ కల్యాణాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ మారిశెట్టి శివశంకర్, ఆలయ కమిటీ ఛైర్మన్ చినిమిల్లి సాంబశివరావు, పట్టణ జేఏసీఎస్ కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ, నాయకులు కంచుమర్తి విశ్వేశ్వరరావు, నిమ్మకాయల బాలాజీ, ముప్పనపల్లి రాంబాబు, సిరిమల్లె శ్రీను, చీర్ల సత్యనారాయణ, ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, టీటీడీ అధికారులు, ఆచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలోనే అన్ని వర్గాలకు మేలు


సూరంపూడి లో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు

ఇరగవరం: వైఎస్సార్ సీపీ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం ఇరగవరం మండలం కె కుముదవల్లి నుంచి 50మంది, తూర్పు విప్పర్రు నుంచి 70మంది, సూరంపూడి నుంచి 40మంది, మొత్తం 190 కుటుంబాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు నాయకులు, కార్యకర్తలు మంత్రి కారుమూరి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువ కప్పి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు అని తెలిపారు. పార్టీలో చేరిన వారంతా పార్టీని బలోపేతం చేయాడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సర్పంచ్‌లు రామయణం జగదీష్, కటారి చంద్ర మణి, కటారి రాంబాబు రాజు జాలి సుబ్బరావు, సొసైటి అధ్యక్షులు సైపురెడ్డి పెద్దిరాజు, మామిడిశెట్టి శ్రీను, సిరగం శ్రీను, ఆకుల రామ సుబ్బరాజు, గనిశెట్టి సూరిబాబు, చొడే జోషి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

యానాం మద్యం బాటిళ్ల స్వాధీనం

యలమంచిలి: పుదుచ్చేరి రాష్ట్రానికి (యానాం) చెందిన మూడు బీరు బాటిళ్లను బుధవారం పట్టుకున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ చెప్పారు. చించినాడ వశిష్ట గోదావరి నది వంతెన వద్ద ఉన్న పోలీస్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక కారులో మూడు బీరు బాటిల్స్ ఉన్నాయన్నారు. వాటి లేబుల్స్ పరిశీలించగా పుదుచ్చేరి రాష్ట్రానికి చెందినవిగా గుర్తించినట్లు చెప్పారు. దీంతో మూడు బీరు బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదో తరగతి పరీక్షలలో భాగంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో టౌన్, రూరల్, పెంటపాడుల్లో మూడో రోజు బుధవారం ఇంగ్లీషు పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. 18 సెంటర్‌లలో పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరిగింది. 3,262 మంది విద్యార్థినీ విద్యార్థులకు గాను 3,069 మంది హాజరైయారు. 193 మంది పరీక్షలకు హాజరుకాలేదు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డీవైఈఓ కార్యాలయం సిబ్బంది వెల్లడించారు.